# బాతాఖాని.

(శ్రీమతి చుండూరి రమాదేవిగారు)

'ఏంచేస్తున్నారండి!'

'రండి కూర్చోండి.'

'ఏమిటిచదువుతున్నారు?'

'భాగవతమండి'

'పిల్లలంతాయేరి?'

'స్కూలుకెళ్లారు.'

'కూరగాయలేమిటి?'

'దోసకాయపప్పు, అరటికాయకూర, చారు.'

'అరటికాయ వేపుడా!'

'కాదండి పులుసువేశాను.'

'ఆకామమ్మగారింట్లో కూరేవండుకోరండి, ఎట్లాతింటారో.'

'... ... ...'

'అయితే యిదివిన్నారా? సీతమ్మగారి అమ్మాయి మొన్న ఆరోజుల్లో కూడా మంచంపుమ్మ కొందిట, మేమెరుగం సుమండీ!'

'... ... ...'

'ఈమధ్య మీ ఆడబడుచు వచ్చినట్టుంది, అప్పుడే వెళ్లారేం?'

'ఆయనకు శెలవులేదట. అందుచేత వెళ్లారు.'

'అయినా యీకాలంలో నెలల తరబడి పోషించగలమా యేమిటిలే!'

'... ... ...'

'మీపెద్ద మేనకోడలికి పెళ్లయిందా?'

'లేదు.'

'ఇంకా యెప్పుడు చేస్తారమ్మా! నేనాయీడుకి ముగ్గురుబిడ్డల తల్లినయినాను.'

'... ... ...'

'అమీనాత్తమ్మగారింటికి వెడతామా, మాటే మాటాడదమ్మా చదువుకుంటూనో, నూలుతీస్తూనో వుంటుంది. అంతగీర్వాణ మేమిటో!'

'... ... ...'

'మీ అత్తగారేది! ఇంటెడు చాకిరీ నీమీద వొదలిపెట్టి యెప్పుడూ తిరుగుతూనే వుంటుందేం?'

'పెద్దవారు, ఏపురాణానికో, హరికథకో వెడుతూంటారు.'

'...  ...  ...'

'అయితే నిన్న మీ ఆయన నీమీద కేకలేస్తున్నాడెందుకూ?'

'పిన్నిగారు, మీరువయసు గడచినవారు, మిమ్మల్నేమీ అనకూడదుకాని, గంటలకొద్దీ ఎందుకీ బాతాఖానీ? ఈ ప్రశ్న పరంపరలవల్ల వచ్చేలాభమేమిటి? మీరు కృష్ణారామ అనుకోరు. నన్ను అనుకోనివ్వరు. నేనేమీ అనలేక మూకీభవంగా వున్నకూడా మీరు గ్రహించరు. మాయింట్లో యేంవండుకుంటే మీకెందుకు? కామమ్మగారింట్లో కూరలేకపోతే మనకేంనష్టం? సీతమ్మగారిపిల్ల మంచం పుచ్చుకుంటె మనకేం? ఈ అప్రస్తుత ప్రసంగంచేసే కాలంలో దేశానికుపకరించే పనేదైనా చెయ్యకూడదూ? నూలు తీయటంకాని, సద్గ్రంధ కాలక్షేపంగాని, పిల్లలకు విద్యాభ్యాసంచేయుటగాని యింట్లోకూడాని చేసేపనులు లక్షున్నాయి. అటువంటి దేదైనా చేస్తేచాలా వుపయోగంగా వుంటుంది.

మొన్నమావారు కోపపడిన కారణమడగటం మర్యాద యెరగనిమాట. మీ అయన జీతమెంత? మీరు కట్టుకున్నచీర చాలా బాగుంది. ఖరీదెంతా? మీఅయన నీమీద ప్రేమగా వుంటాడా? ఉంటే నీకుపిల్లలెందుకు పుట్టలేదు? పుడితే ఒక్కడే పుట్టాడేం? చాలామంది పుడితే అంతమంది పుట్టారేం? అంతమందినీ ఎల్లాపోషిస్తారు? కూరలోపులుసు వేసుకోరేం? - ఎందుకొచ్చిన బాతాఖానీ. ఇట్లా వృధాచేసేకాలంలో రాట్నం వడకండి; మీపిల్లల చేతవడికించండి; వార్తా పత్రికలు చదివి ప్రపంచ పరిస్థితులు అవగాహనం చేసుకొండి; అప్పడాలు, వడియాలు, చారుపొడి, సబ్బులు అన్నీయింట్లోతయారు చేసుకోండి; గృహోపకరణమైన సామగ్రులు, గృహాలంకరణమైన లేసులు, చిత్రలేఖనము, హృదయానంద కరమైన సంగీతము, ఆత్మవికాసము కలిగించే సద్గ్రంధ పఠనము ఇటువంటివన్ని జీవితానికి ఉపయోగ కరమైనవి. అంతేగాని, పొరుగిళ్ల పెత్తనాల వలన లాభమేమీలేదు. "పగటిపెత్తనం పనికి చేటు; రాత్రిపెత్తనంనిద్రకు చేటు." అన్నారు. పైగా మీనాక్షమ్మగార్కి గర్వమంటున్నారు. ఆమెచాలా వివేకవతి, నిగర్వ చూడామణి. ధనవంతురాలననే గర్వమిసుమంతైనా లేదు. మీస్వభావానికి సరిపడక అట్లాఅభిప్రాయ పడ్డారు. ఇకనుండైనా అనవసరప్రశ్నలతో పరులను విసిగించకండి. ఇల్లాకఠినంగా అన్నానని కోపముంచుకోకండి, ఈ అలవాటు మీకేకాదు. చాలమందికుంది. ఇటువంటివి అమర్యాదను, నాజూకులేమిని సూచిస్తాయి. ఇక వంటవేళైంది, శలవు.'

---

కలియుగమున గుణవతులగు
చెలువలు "గృహలక్ష్మి" సేవఁ జేయుచుఁ దమ పే
రులు కే. యన్. కేసరి వ
ర్యులు వ్రాయఁగఁ దెలియఁ బడుదు రుర్విఁ శుభముఁగన్.

— తాటిపర్తి వెంకటసుబ్బారావు.